సాక్షి

# అభివృద్ధిలో భాగంగానే నగరీకరణ

## హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి




**కార్యక్రమానికి ముందు జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎన్వీఎస్ రెడ్డి తదితరులు**

సాక్షి, సిటీబ్యూరో: నగరీకరణ దేశ సమగ్ర అభివృద్ధిలో భాగమని, దానిని ఒక సమస్యగా పరిగణించరాదని హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి అన్నారు. అధిక జనాభా, పర్యావరణ సమస్యలు, కాలుష్య నియంత్రణ, వేగంగా పెరుగుతున్న నగరీకరణ వంటి సవాళ్లను ఎదుర్కోవడానికి ఆర్కిటెక్టులు సాంకేతిక పరిజ్ఞానంతో వినూత్నంగా ఆలోచించాలని, సామాజిక, ఆర్థిక కోణంలో సాంకేతిక పరిష్కారాలను అన్వేషించాలని సూచించారు. ఆదివారం నగరంలో జరిగిన అఖిల భారత 'ఆర్కిటెక్చర్ రికనెక్ట్ సమ్మిట్'లో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. దేశంలో అత్యధిక జనాభా ఇప్పటికీ వ్యవసాయంపై ఆధారపడి ఉందన్నారు. చైనా తరహాలో పారిశ్రామిక రంగానికి ప్రాధాన్యమిచ్చి, వ్యవసాయ రంగం నుంచి వీలైనంత మందిని పారిశ్రామిక రంగానికి మళ్లించాలన్నారు. నగరీకరణ ప్రక్రియలో భాగంగానే దేశాభివృద్ధి మరింత శీఘ్రతరమవుతుందన్నారు. హైదరాబాద్ మెట్రో రైల్ గొప్ప ప్రజా రవాణా వ్యవస్థగా ఆదరణ పొందడానికి అనేక కొత్త ఆవిష్కరణలే కారణమని చెప్పారు. రవాణా ఆధారిత అభివృద్ధిపై ప్రత్యేక ఆలోచనలు చేయాలని, అందుకు అనుగుణంగా నగరాలలో మెట్రో మార్గాల వెంబడి బహుళ అంతస్తుల నివాస గృహాలను, కమర్షియల్ కాంప్లెక్సులను, విద్యా సంస్థలను అభివృద్ధి చేయాలని మెట్రో ఎండీ సూచించారు. తాము చేపట్టిన ఇంధన పొదుపు , పర్యావరణ హిత చర్యల తో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక అవార్డులను పొందినట్లు వెల్లడించారు. నగరీకరణ గణనీయంగా పెరిగినప్పుడు రవాణా పరమైన సమస్యలు కూడా అదే స్థాయిలో పెరుగుతాయన్నారు. అందుకు నిర్మాణ రంగ నిపుణులు తగు పరిష్కార మార్గాలను శోధించాలని కోరారు.

15/09/2025 | Hyderabad | Page : 7
Source : https://epaper.sakshi.com/